క్లుప్తంగా

కస్తూర్‌బా పాఠశాలకు డెస్కుల వితరణ



దాత శేఖరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్: ఏలూరు కస్తూర్‌బా బాలికల పాఠశాలకు కాశీపట్నం ఫౌండేషన్ ట్రస్టీ ఇందు శేఖరరావు రూ.6 లక్షల విలువైన వస్తువులు బహుకరించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రూ.5 లక్షల విలువ గల 50 డ్యూయల్ డెస్కులు, రూ.లక్ష విలువైన 800 స్టీల్ కంచాలు పాఠశాల హెచ్‌ఎం జి.సునీతకు అందజేశారు. గతంలో సైతం దాత పాఠశాల క్రీడాకారిణిలకు రూ.32 వేల విలువ కల్గిన బూట్లు అందజేశారు. ఈ సందర్భంగా శేఖరరావుకు ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం జల్లా వీరభద్రరావు, ట్రస్ట్ సమన్వయకర్త శంకర వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

8న అమర వీరుల వర్ధంతి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ పోరాట అమర వీరుడు సత్తెనపల్లి రామకృష్ణ, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు అమరజీవి చాకలి ఐలమ్మ, ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్ఆర్‌పేటలోని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంఘం కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో-కన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావు ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వివిధ వృత్తి సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

సీఈవో సేవలు అభినందనీయం



డీఈవో శ్యామ్‌సుందర్ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న సీఈవో రవికుమార్

ఏలూరు(మెట్రో): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఈవో రవికుమార్‌ను డీఈవో శ్యామ్ సుందర్ సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉద్యోగులు సీఈవో సేవలను కొనియాడారు. గతంలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి, ప్రస్తుతం జిల్లా పరిషత్ సీఈవోగా విధులు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. రవికుమార్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉద్యోగులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అపుస్మా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



అపుస్మా ఆధ్వర్యంలో సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఉపాధ్యాయ దినోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, నగర డిప్యూటీ మేయర్ గుడిదేసి శ్రీనివాస్, అపుస్మా ఏలూరు జోన్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, కార్యదర్శి ఎస్ఆర్‌కేఏ ప్రసాద్, కోశాధికారి కె.వినోద్, ఎంబీఎస్ శర్మ, జీ.బుల్లెబ్బాయి, జీ రవి శంకర్, ఏలూరు అర్బన్ స్కూల్స్ ఇన్‌స్పెక్టర్ డీ సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులు



గురుపూజోత్సవంలో పాల్గొన్న శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్‌కుమారి



ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరికి మార్గదర్శకులని శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఏ.మేరీగ్రేస్ కుమారి పేర్కొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక అశోక్ నగర్‌లోని అమలోద్భవి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అత్యున్నతమైన వ్యక్తి కూడా విద్యార్థి దశనుంచే జీవితం ప్రారంభిస్తారని, ఈ విద్యార్థి దశలో నేర్చుకున్న క్రమశిక్షణ, లక్ష్యమే జీవితానికి మార్గమవుతుందన్నారు. విద్యార్థులు మంచి ప్రవర్తనతో, ఉన్నతమైన ఆలోచనలతో శ్రద్ధగా చదువుకోవాలని మేరీ గ్రేస్ కుమారి సూచించారు. సమాజంలో రవాణా, పోస్టల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, పరిశుభ్రత, విద్య, వైద్య, రియల్ ఎస్టేట్ మొదలైన సేవల పైన లోపం జరిగితే శాశ్వత లోక్‌అదాలత్‌ను సంప్రదించవచ్చన్నారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో అన్ని సేవలు ఉచితమని, ఎటువంటి ఫీజులు చెల్లించనవసరం లేదన్నారు. ఈ లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులకు అప్పీలు లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ జ్యోతి, ప్రిన్సిపాల్ రోషిణి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

ఏలూరు హేలాపురి చైతన్య లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో రిటైర్డ్ ఉప విద్యాశాఖాధికారి వేర్పుల బాపూజీ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పి.నాగసాయి బాబాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కే నాగతేజస్వి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో మంగళవారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మార్గం వైపు నడిపిస్తారని కొనియాడారు. ఉపాధ్యాయుల సన్మానం అనంతరం నిర్వాహకులు ఎంపీపీతో పాటు ఇన్‌చార్జి ఎంపీడీఓ వై సుజాతకు మొమెంటో అందించి, శాలువ కప్పి అభినందించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి-1, 2 అల్లూరి రవిప్రకాష్, ఆర్ రంగయ్యతో పాటు పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు. తంగెళ్ల మూడి శ్రీసూర్య స్కూల్ ఆవరణలో డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.



తంగెళ్లమూడిలో ఉపాధ్యాయురాలును సన్మానిస్తున్న దృశ్యం



బధిర పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



అధ్యాపకులను సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల ప్రతినిధులు

శేషారత్నంకు అభినందనలు

కొల్లేరు గ్రామం పైడిచింతపాడు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు డి.శేషారత్నంకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. మంగళవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికారుల చేతులమీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

ఏలూరు రూరల్: దివ్యాంగులకు సేవలు అందించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం దొండపాడు పరివర్తన బధిరుల పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ఎస్‌కే ప్రసన్న, యు.లక్ష్మీలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరెడ్డి, డీఎడ్ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల ముఖ్య భూమిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషిస్తారని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా అన్నారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సందర్భంగా కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్స్‌పాల్ గిరిబాబు అధ్యక్షత వహించారు. సీపీడీసీ సభ్యుడు ఎల్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకటరావు, సీహెచ్. ఉదయలక్ష్మి, ఎస్. పరమేశ, ఎం.రాంబాబు, ఎం.కృష్ణ చైతన్య, టీవీఎస్ పద్మావతి, పీఆర్. కావ్యశ్రీ, పీ.వెంకటదుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అధ్యాపకులను శాలువాలతో సన్మానించారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం



సుషుమ్న యోగా క్రియపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వాసంతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్ ప్రతినిధి బీ వాసంతి తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ద్వితీయ సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు సుషుమ్న క్రియాయోగం ద్వారా వారి భవిష్యత్‌కు ఎంతవరకూ ఉపయోగపడుతుందో, యోగా ఎందుకు చేయాలి, దాని ద్వారా పొందే ప్రయోజనాలపై అవగాహన తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ శరీరం మొత్తం 72 వేల నాడులతో ప్రాణశక్తి నింపి దాని ద్వారా నాడులను చైతన్యపరిస్తే ఎంతో మానసిక ఆరోగ్యంగా ఉండగలమన్నారు. ముద్ర, ఓంకారం, భావంతో శ్వాస, నేత్రధ్యానం సుషుమ్న క్రియా యోగాలో ప్రధానమైనవన్నారు. ఆయా చర్యల ద్వారా శరీరం, మనస్సు, మెదడు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఆరోగ్యం దృఢంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని గడియార స్థంభం రోడ్డులో ఉన్న దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని శ్రీ అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజానికి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సమాజం కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగమునేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి జారీ చేసిన నోటీసుల ప్రకారం ఆసక్తి కలిగిన అభ్యర్థులు 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

6,7 తేదీల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఏలూరు (టూటౌన్): అఖిల భారతీయ యాదవ మహాసభ ఏలూరు జిల్లా, ఏలూరు నగర కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, నగర కమిటీ అధ్యక్షుడు బొట్టా అజయ్ కుమా తెలిపారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 6వ తేదీన ఏటిగట్టు వద్ద గల సంఘం జిల్లా కార్యాలయం నుంచి రథయాత్రను నగర పుర వీధుల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 7వ తేదీ ఉదయం సంఘ భవనం వద్ద ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమాలు, భజన, చిన్నపిల్లల శ్రీకృష్ణ వేషధారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 7.30 గంటలకు స్థానిక 40వ డివిజన్ చేపల తూము సెంటర్ నందు ఉట్టికొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, రాష్ట్ర సాహిత్యమండలి చైర్‌పర్సన్ పిళ్లంగోళ్ళ శ్రీలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పలువురు కార్పొరేటర్లు, అన్ని పార్టీలకు చెందిన నాయకులు హాజరుకానున్నట్లు చెప్పారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, కోశాధికారి గొర్ల రామారావు, ఏలూరు నగర ఉపాధ్యక్షుడు చిట్టిబోయిన సాయిబాబా, ఏలూరు నగర కోశాధికారి భోగ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



యాదవ సంఘం జిల్లా కార్యాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడకుల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

9న శ్రీవారి వస్త్రాల వేలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 9వ తేదీన స్వామివారి వస్త్రాల వేలం కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేలంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన పంచెలు, ఉభయ దేవేరులకు సమర్పించిన చీరలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్, ట్రస్టీల సమక్షంలో వేలం నిర్వహిస్తామన్నారు.

సీపీఐ బహిరంగ సభ విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): సీపీఐ నిర్వహిస్తున్న బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 8న తిరుపతిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపు నిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్ నందు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా బహిరంగ సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రంను నష్టాల ఊబిలోకి కేంద్రం నెట్టివేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 2014 ,2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిందన్నారు. విచ్ఛిన్నకర విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. సీపీఐ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. గోడపత్రిక ఆవిష్కరణ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

కొబ్బరి కొనుగోలు కేంద్రాలను తెరవాలి

ఏలూరు (టూటౌన్): కొబ్బరి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరచి కొబ్బరి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్ నందు ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు బొల్లి రామకృష్ణ అధ్యక్షతన కొబ్బరి రైతుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 35 వేల ఎకరాల్లో కొబ్బరి తోటల విస్తీర్ణం ఉందని చెప్పారు. కొబ్బరికాయలకు కనీస ధరలు రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు గత యేడాది వరకూ 100 కొబ్బరి కాయలకు రూ.1000 నుంచి రూ.1200 ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700 మాత్రమే ఇస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులకు అనుమతులు ఇవ్వడం వల్ల దేశీయ మార్కెట్‌లో కొబ్బరి ధర పడిపోయిందన్నారు. నష్టాల్లో కూరుకుపోతున్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, ఆయిల్‌ఫెడ్‌లను వెంటనే రంగంలోకి దింపి కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని కోరారు. జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలను సహకార రంగంలో ఏర్పాటు చేయాలని కోరారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించాలని, ఉద్యానపంటలకు సబ్సిడీ పథకాలు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో కొబ్బరి రైతులు పి.అచ్యుతరామయ్య, జి.రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

వెలుగు వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): వెలుగు వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వీరికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం బాధాకరమన్నారు. వేతనాలు పెంచాలని, నేరుగా వీవోఏల బ్యాంక్ ఖాతాల్లోనే ప్రభుత్వం వేతనాలు జమచేయాలని కోరారు. వీవోఏల సంఘం జిల్లా నాయకురాలు షేక్ సుభానీ మాట్లాడుతూ లోకో యాప్స్ తీసుకువచ్చి డేటాను అప్‌లోడ్ చేయమంటున్నారని దానికి 5జీ ఫోన్ ఉంటే గాని సాధ్యం కాదన్నారు. పనిఒత్తిడి తగ్గించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. ధర్నా అనంతరం వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్ నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా షేక్ సుభాని, 20 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.



డీఆర్‌డీఏ పీడీ విజయరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏల సంఘం నాయకులు

పశుసంపద అభివృద్ధికి పశువిజ్ఞాన బడి

కుక్కునూరు: స్థానిక వనరులను ఉపయోగించుకొని ప్రతి రైతు పశుసంపద ద్వారా రెట్టింపు ఆదాయాన్ని పొందవచ్చని జీలుగుమిల్లి పశు సంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం.సాయిబుచ్చారావు పేర్కొన్నారు. మంగళవారం కుక్కునూరు రైతుభరోసా కేంద్రంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెల పెంపకములో అనుసరించాల్సిన మెలకువల గురించి గొర్రెల యజమానులకు వివరించారు. ప్రభుత్వం తరుపున గొర్రెలకు ఉచితంగా అందిస్తున్న టీకాలను వేయించాలన్నారు. నట్టల సమస్యతో పశువులు మృత్యువాత పడే అవకాశం ఉంటుందని, కనుక సమయానుకూలంగా నట్టల నివారణ మందులను పశువులకు అందించాలన్నారు. అంతేకాక అన్నిరకాల పశువులకు సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తున్న దాణాల గురించి, వాటి వలన పశువులకు అందే పోషకాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక గొర్రెల, పశు యజమానులు, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నష్టపరిహారం ప్రకటించాలని ఆందోళన

చింతలపూడి: సీతానగరం ఆయిల్‌పాం ఆగ్రోవెట్ ఫ్యాక్టరీలో సోమవారం ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఒరిస్సాకు చెందిన సాహిల్ శెట్టి కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన జరిపారు. చింతలపూడి మార్చురీ వద్ద మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండా అడ్డుకున్నారు. దీంతో ఎస్సై కె ప్రసాద్, అసిస్టెంట్ లేబర్ అధికారి కలిసి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో, కాంట్రాక్టర్ నుంచి రూ.2.40 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఈఎస్ఐ పెన్షన్ లేదా వర్క్‌మెన్ కాంపన్సేషన్ కింద రూ.14.60 లక్షలు ఇవ్వడానికి అంగీకారం కుదిరిందని యూనియన్ నాయకులు తెలిపారు.

బాలవికాస కేంద్రాల్లో చదువు, సంస్కారం నేర్పాలి

ద్వారకాతిరుమల: బాలవికాస కేంద్రాల్లో చదువుతో పాటు విద్యార్థులకు సంస్కారం కూడా నేర్పాల్సిన బాధ్యత ఆచార్య మాతాజీలదేనని సమరసత సేవా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారవాడల్లో నిర్మించిన దేవాలయాల వద్ద నిర్వహించే బాలవికాస కేంద్రాల ఆచార్య మాతాజీలకు శ్రీవారి కొండపైన ధర్మఅప్పారాయ నిలయంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న త్రినాథ్ మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను గౌరవించే విధంగా, మన సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు నేర్పాలన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలో 420 బాలవికాస కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రముఖ్ కొండా రెడ్డి, రాష్ట్ర బాలవికాస్ మహిళా కన్వీనర్ విజయలక్ష్మి, రాష్ట్ర ధర్మప్రచారకులు ముద్దు సాయిరాం తదితరులున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	19
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33